వాన సన్నగా కురుస్తూనే వుంది.

శ్రీనాథ్ కిటికీ దగ్గర నిలబడి ఎదురింటికేసి చూస్తున్నాడు.

ఎదురింటి కిటికీలోనుండి కూడా ఒక స్త్రీ శ్రీనాథ్‌వైపే చూస్తూ నిలబడింది.

# వర్షంలో ప్రేమ

బలభద్రపాత్రుని రమణి

శ్రీనాథ్ సిగరెట్ త్రాగుతున్నాడు.

ఆమె టీ త్రాగుతోంది.

వారంరోజులుగా రోజూ సాయంత్రం పూట ఇదే కార్యక్రమం జరుగుతోంది. వారం క్రితం ఎదురుగా వున్న పెంకుటింట్లోకి ఆ దంపతులు వచ్చి చేరారు. ఎవరూ పట్టుమని పదిరోజులు కూడా ఆ ఇంట్లో వుండలేరు.

అంత అసౌకర్యంగా వుంటుంది ఆ ఇల్లు. బావిలోంచి నీళ్లు తోడుకోవాలి. వర్షాకాలంలో వాన ఇల్లంతా కురుస్తుంది. బాత్రూంకి తలుపు కూడా లేదు. పరదా వేసుకుని వాడుకోవాలి. మధ్య తరగతికన్నా కింది తరగతి మనుష్యులైతేనే ఆ ఇంట్లో ఓ మాదిరిగా ఇమడగలరు.

శ్రీనాథ్ ఎప్పుడూ ఆ ఇంటి గురించీ, ఆ ఇంట్లోకి అద్దెకి దిగే మనుషుల గురించీ పట్టించుకోలేదు. అతనికి అంత టైం, అవసరం వుండేదికాదు. కానీ ఈసారి మాత్రం పట్టించుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

ఆ రోజు శనివారం కావడంతో బాల్కనీలో కూర్చుని పేపర్ చదువుకుంటూ వుండగా ఎదురింటి ముందు బండి వచ్చి ఆగింది. అందులోంచి సామాన్లు దింపుకోవడం, బండివాడి అరుపులు వినిపిస్తున్నా శ్రీనాథ్ పెద్దగా పట్టించుకోలేదు. తల కూడా అటు తిప్పి చూడలేదు.

''సార్! మిమ్మల్నే... వంద రూపాయల చిల్లర వుందా?'' అన్న గొంతు వినిపించి తప్పదని పేపర్లోంచి తల ఎత్తాడు శ్రీనాథ్.

ఎదురుగా తెల్లని లాల్చీ, పైజమాలో ఓ యువకుడు నిలబడి నవ్వుతూ అడుగుతున్నాడు.

''ప్రొద్దునే ఇబ్బంది పెడుతున్నందుకు క్షమించాలి'' అతను ధారాళంగా ఇంగ్లీషు మాట్లాడుతున్నాడు. ''ఈ బండివాళ్లతో ఇదే తంటా. ఎక్కేవరకు ఒక మాటా, ఎక్కాక ఒక మాటా! వాళ్లతో మాటలు పెంచుకోవడంకన్నా అడిగింది ఇచ్చేస్తే సరి అంటుంది మా స్వర్ణ.''

శ్రీనాథ్ జేబులోంచి పర్సు తీస్తూ ఆ చివరి మాట విని తలెత్తి ఎదురింటివైపు చూసాడు.

ఆమె అలసటగా చీర కొంగుతో మొహం తుడుచుకుంటూ ఇటే చూస్తోంది. నిజంగా స్వర్ణ ప్రతిమలాగే వుంది. ముక్కుకున్న ఒంటిరాయి ముక్కుపుడక ఎండపడి ధగక్‌మని మెరుస్తోంది. తలలో వడిలిపోయిన మల్లెచెండూ, నలిగిపోయి ఒంటికి చుట్టుకుపోతున్న కాటన్ చీర ఆమెని మరింత అందంగా చూపెడుతున్నాయి.

''సార్...నేను అడిగింది వందకి చిల్లర. ఇన్ని వందనోట్లు ఇస్తున్నారేమిటి?'' అతను కంగారుగా అనేసరికి శ్రీనాథ్ ఈలోకంలోకి వచ్చి ''సారీ'' అని పదినోట్లు తీసి అందించాడు.

''థాంక్యూ సార్. నా పేరు ఆనంద్. సన్నకారు వ్యాపారస్తుడ్ని. అంటే సన్న సన్న అగరుబత్తీలు అమ్ముతుంటాను. బైదిబై మీరేం చేస్తుంటారు?'' అతను గబగబా పరిచయాలు మొదలుపెట్టేసాడు.

శ్రీనాథ్ పని చేస్తున్న కంపెనీ పేరు చెప్పి ''ఇక్కడ ఏరియా ఆఫీసర్‌గా వుంటున్నాను'' అన్నాడు.

''సంతోషం. మంచి కుటుంబం ఎదురింట్లో వున్నందుకు చాలా ఆనందంగా వుంది'' అన్నాడు ఆనంద్.

శ్రీనాథ్ ఇబ్బందిగా మొహంపెట్టి ''కుటుంబం లేదు. నేను ఒక్కడ్నే వుంటాను'' అన్నాడు.

''ఎంత అదృష్టవంతులు సార్? ఇంకా పెళ్లి కాలేదా?'' అని తన జోక్‌కి తనే పెద్దగ నవ్వి ''ఇంత పెద్ద ఇంట్లో ఒక్కరే వుండడానికి భయం వేస్తే మా ఇంటికి రండి'' అని ఆహ్వానించాడు ఆనంద్.

''ఏవండీ... కబుర్లు తర్వాత చెప్పుకోవచ్చు. త్వరగా రండి'' ఆమె కాస్త విసుగ్గా అరిచింది.

''ఆ వస్తున్నా... మా స్వర్ణ పిలుస్తోంది. వస్తా సార్'' అని ఆనంద్ వెళ్లిపోయాడు.

ఆమె సూట్‌కేస్ తీసుకుని ఇంట్లోకి నడుస్తూ వుంటే ''బ్యాక్ సింప్లీ సూపర్బ్'' అనుకున్నాడు శ్రీనాథ్.

అతని మనసులో ఆలోచన ఆమెకి చేరినట్లు ఆమె వెనక్కి తిరిగి అతనివైపోసారి చూసి ఇంట్లోకి నడిచింది.

ఆ రోజు నుండి శ్రీనాథ్ కారు చప్పుడు అవగానే ఆమె ఎక్కడున్నా కిటికీ దగ్గరికి వచ్చి చూస్తూనే వుంది.

శ్రీనాథ్ సిగరెట్ అయిపోవడంతో అవతల పారేస్తూ ''లాభంలేదు. ఒక స్టెప్ వెయ్యాలి తప్పదు'' అనుకున్నాడు.

★★★

శ్రీనాథ్ కారు డ్రైవ్ చేస్తూ అద్దంలో స్వర్ణని




చూస్తున్నాడు.

మొదటిసారిగా కారు ఎక్కిన ఆనందం ఆమె కళ్లల్లో కనబడిపోయింది. ముంగురులు అవసరం లేకపోయినా సవరించుకుంటూ కిటికీలోంచి బైటికి చూస్తోంది. అప్పుడప్పుడు శ్రీనాధ్‌వైపు కూడా చూస్తోంది.

ఆనంద్ ఆపకుండా మాట్లాడుతూనే వున్నాడు.

''ఇంతకీ పిక్చర్ ఎలా వుంది?''

''నాకు చివర్లో హీరో ఇద్దర్నీ పెళ్లి చేసుకోవడం అసలు నచ్చలేదు'' ఆనంద్ చెప్పాడు.

''స్వర్ణగారూ మీరేం అంటారు?'' శ్రీనాధ్ చొరవగా అడిగాడు.

''నాకు బాగా నచ్చింది. హీరోయిన్స్ కట్టుకున్న చీరలు చాలా బాగున్నాయి. పాటల సీన్లు అమోఘంగా తీసారు'' ఎక్సైట్ అయిపోతూ అంది స్వర్ణ.

కారు ఇంటిని సమీపించింది. ఆ రోజు ఆనంద్ బలవంతంమీద శ్రీనాధ్ భోజనం అక్కడే ఏర్పాటయింది.

మరునాడు స్వర్ణ చేతిలో శ్రీనాధ్ ఓ ప్యాకెట్ వుంచి చెప్పాడు ''నిన్న సినిమాలో హీరోయిన్ కట్టుకున్న చీరలాంటిదే. కానీ ఆ హీరోయిన్‌కన్నా మీరే ఈ చీరలో ఎక్కువ అందంగా ఉంటార్లెండి.''

స్వర్ణ సిగ్గుపడుతూ అందుకుంది.

ఆమెకి అతని దగ్గర మొహమాటంపోయి చనువు పెరగడానికి ఎక్కువకాలం పట్టలేదు. చీటికీ మాటికీ వచ్చి ఫోన్ చేసుకునేది.

''ఎవరికో అస్తమానం ఫోన్లు?'' ఓసారి శ్రీనాధ్ అడిగాడు.

''ఈర్ష్యగా వుందా?'' ఆమె కొంటెగా అడిగింది.

''చాలా'' శ్రీనాధ్ చెప్పాడు.

ఆమె నవ్వి ''మా అన్నయ్యకే. మీరంత బాధపడనక్కర్లేదు'' అంది.

శ్రీనాధ్‌కి ఆమెవల్ల చాలా లాభాలున్నాయి. అతను వచ్చేసరికి ఇల్లంతా అద్దంలా తీర్చిదిద్దేది. రుచికరమైన వంట చేసి పెట్టేది. అతని బట్టలు కూడా ఆమే ఇస్త్రీ చేసేది. ఆనంద్ ఎప్పుడో పొద్దునపోయి రాత్రికి ఇల్లు చేరేవాడు.

శ్రీనాధ్ ఆమెకి దగ్గర కావడానికి ఎక్కువ కష్టపడాల్సిన అవసరం రాలేదు. అతనికి ఇప్పుడు రోజులు హాయిగా గడిచిపోతున్నాయి. జీవితం అంటే, ఇల్లంటే ఒకప్పుడు బోర్‌గా వుండేది. ఇప్పుడు ఇంటికి రావడానికి హాయిగా వుంటోంది. ఎప్పుడైనా కాస్త ఆలస్యం అయితే స్వర్ణ కంట నీరు పెట్టుకుని ''ఎంత బెంగ వేసిందో తెలుసా? ఓ ఫోన్ అయినా చేయవచ్చుగా? ఇక్కడే పడి వుంటానని తెలుసుగా'' అని ముక్కు ఎగబీల్చేది.

అతనికి తమషాగా వుండేది. ఇంటి ఖర్చులన్నీ స్వర్ణే చూస్తోంది. ఆమెకి అతను ఓ గొలుసు, గాజులు కూడా చేయించాడు. ఆమె పేరుకి మాత్రం ఎదురింట్లో ఉండేది. ఆనంద్‌తో రాత్రుళ్లు గడిపేది. తెల్లవారిన దగ్గర్నుంచీ శ్రీనాధ్‌తోనే వుండేది.

ఏడాది గిర్రున తిరిగిపోయింది. స్వర్ణకి నెల తప్పింది.

''ఎవరివల్లా?'' శ్రీనాధ్ ఆమెని మురిపెంగా దగ్గరగా తీసుకుంటూ అడిగాడు.

ఆమె నాలుక బైటపెట్టి వెక్కిరించి పారిపోయింది.

''నేను పుట్టింటికి వెళ్తున్నాను'' అని ఒకరోజు ఆమె చెప్పేసరికి శ్రీనాధ్ మిన్ను విరిగి మీద పడ్డట్టు చూసాడు.

''తప్పదుగా... వచ్చేస్తానుగా'' ఆమె గారాలు పోయింది.

శ్రీనాధ్ ఆమెకి పదివేలు క్యాష్ చేతిలో పెట్టి నుంచి ఆసుపత్రిలో చూపించుకోమని, జాగ్రత్తలు చెప్పాడు.

స్వర్ణ అతనికి నుదుటిమీద ముద్దు పెట్టి వెళ్లిపోయింది.

ఆమె వెళ్లాక రోజూ అతను ఉత్తరం కోసం ఎదురు చూడసాగాడు. ఉత్తరం రాలేదు. ఒకనాడు క్యాంప్ నుండి తిరిగి వచ్చేసరికి కిరాణా కొట్టువాడు అదిరిపడే న్యూస్ చెప్పాడు. ఆనంద్ ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయాడుట. వేరే రాష్ట్రం వెళ్లిపోతున్నానని చెప్పాడుట. అడ్రస్ కూడా ఇవ్వలేదుట. స్వర్ణ ఇంక రాదా...పిల్లాడు పుట్టాడో, పిల్ల పుట్టిందో... ఎవరిలా వుందో? అతను ఆమె ఉత్తరం కోసం ప్రతిరోజూ ఆశగా ఎదురు చూస్తూనే వున్నాడు.

★★★

ఎదురింటి ముందు లారీ వచ్చి ఆగింది.

ఎవరో ముసలి దంపతులు పిల్లలతో దిగుతున్నారు.

శ్రీనాధ్ ఉస్సూరని నిట్టూర్చాడు. అతని చేతిలో ఉత్తరం వుంది. అది ఆ ముందు రోజే స్వర్ణ దగ్గర్నుంచి వచ్చింది. అతను మరోసారి దాన్ని చదువుకున్నాడు.

''శ్రీనాధ్‌గారూ! మీ స్వార్థం కోసం నాతో పరిచయం పెంచుకున్నారు. నా స్వార్థం కోసం నేను మిమ్మల్ని వాడుకున్నాను. దరిద్రంలో మగ్గిపోతున్న మాకు మీరో ఆలంబన అయ్యారు. మీరిచ్చిన డబ్బుతో మేము ఓ షాపు పెట్టుకున్నాము. బాబుని ఏ లోటూ లేకుండా పెంచుకోగలమన్న నమ్మకం ఏర్పడింది. నాకు మీరిచ్చిన డబ్బుకి సరిపడా నేను మీకు సేవలు చేసాననే అనుకుంటున్నాను. బార్టర్ సిస్టమ్ అంటే ఇదే! మనం జీవితంలో ఇంక మళ్లీ కలుసుకోలేము. అందుకే మీకు ఇంకో సంగతి చెప్పాలనుకుంటున్నాను. నేను ఆనంద్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాము. మీతో కలసి వున్నప్పుడు కూడా నేను ఆయన్నే తలచుకునేదాన్ని. బాబు అచ్చు గుద్దినట్టు ఆయనలాగే వుంటాడు. నేను అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఆనంద్‌నే ప్రేమిస్తున్నాను. మిమ్మల్ని ఓ యజమానిగా అభిమానించాను. మీ పర్సుని మాత్రం ప్రేమించాను. అందుకు క్షమించండి.

శలవు

'ఆమెది అర్థం వున్న స్వార్థం'! స్వగతంలా అనుకున్నాడు శ్రీనాధ్.

❄